క్లుప్తంగా

పోలీసుల కవాతు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మీదుగా రాగిమానుపెంట క్రాస్ వరకు స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కవాతు చేపట్టారు. సీఐ లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రజలు తమ ఓటు నిర్భయంగా వేసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జున్, ఏఎస్‌ఐ మల్లప్ప పాల్గొన్నారు.

పూతలపట్టు మండలంలో



పూతలపట్టు: మండలంలోని గొడుగుచింత, పి.కొత్తకోట, పూతలపట్టు, వావిల్‌తోట, యం. బండపల్లి గ్రామంలో ఎస్ఎస్‌బి కంపెనీ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా ఎన్నికల సమయంలో జరిగే గొడవలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బి డీఎస్పీ బినిత్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

బంగారుపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కరిడివారిపల్లెలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మంగళవారం పార్టీ ఆవిర్భావ వేడుకలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దోమల నివారణకు జాగ్రత్తలు

యాదమరి: గ్రామీణ ప్రజలు దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. మండలంలోని బుడితరెడ్డి పల్లె ముస్లింవాడలో సోమవారం డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నివాస గృహాల మధ్య పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం



అమరనాథ రెడ్డిని సన్మానిస్తున్న పాడిరైతులు

యాదమరి: పదోన్నతిపై వెళ్లిన పశువైద్యాధికారి అమరనాథ రెడ్డిని పశువైద్యాధికారులు, అసిస్టెంట్ వైద్యులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో పశువైద్యాధికారిగా ఉన్న అమరనాథ్ రెడ్డికి ఏడీగా వైఎస్సార్ కడపజిల్లా పులివెందులకు పదోన్నతిపై వెళ్లారు. ఆయనకు సోమవారం మండలంలోని లక్ష్మయ్యకండిగ పశువైద్య శాలలో సన్మానం చేశారు. మండల స్థాయి పశువైద్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 61 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరస్వతి, దివ్య, శిల్ప, శశి, అశ్విని పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

ఐరాల: మహిళలకు చెక్కు అందిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్



పూతలపట్టు: అక్కచెల్లెమ్మలకు చెక్కును అందజేస్తున్న సునీల్‌కుమార్



మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్
- వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

ఐరాల: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు అనుగుణంగానే మహిళల పేరిట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు రూపకల్పన చేశారని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సునీల్‌కుమార్ హాజరై మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళల రుణాలు మాఫీ చేస్తానని, నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తానని 650 మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో కొత్త డ్రామా తెరపైకి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ఏ పథకం పొందాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్నకు అక్కాచెల్లెమ్మలంతా అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద మండలంలో 2,705 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5.75 కోట్ల మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మహిళలకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి సునీల్‌కుమార్, నాయకులు, అధికారులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, జెడ్పీటీసీ సుచిత్ర, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ధనచంద్రారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ హారూన్ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న

పూతలపట్టు: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలుస్తోందని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ చేయూత 4 విడత చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇందులో సునీల్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకు అందించడం ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మండలంలో 2,156 మంది లబ్ధిదారులకు రూ.4.4 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. త్వరలో కొత్త మేనిఫెస్టోను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటిస్తారని, వాటి ద్వారా రెండింతలుగా మేలు చేస్తారని తెలిపారు. అనంతరం అక్కచెల్లెమ్మలకు చేయూత చెక్కును అందజేశారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ కుమారి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, ఏపీ ఎం నాగరత్న పాల్గొన్నారు.

వలంటీర్లే సారథులు

తవణంపల్లె: జగనన్న సైన్యంగా పేరొందిన వలంటీర్లే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సారథ్యం వహించి, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయించి గెలిపించాలని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వలంటీర్ల ఆత్మీయ సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో సారి సీఎం అయితే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. వలంటీర్లను తొలగిస్తామని, కేసులు పెడతామని ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికల సమయంలో గత్యంతరం లేక కొనసాగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు సన్నిహితంగా ఉన్న వలంటీర్లు వృద్ధులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు ఫ్యాను గుర్తుకు ఓటేసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కొంతమంది వలంటీర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని ఉత్సాహంగా చెప్పారు. మండల సచివాలయ కన్వీనర్ శరత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పరమేశ్వర రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, రాజశేఖర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, దామోదరం, వాసు, జనార్దన్, మురుగేషన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు

గుడిపాల: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని తహసీల్దార్ విజయకుమారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పుల సవరణకు తగిన ఆధారాలను సేకరించాలన్నారు. ఫామ్–6,7 క్లెయిమ్‌లకు సంబంధించి రికార్డులన్నింటినీ పక్కాగా నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీలు కళ్యాణి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

చిత్తూరు కలెక్టరేట్: దేశంలో పలు చోట్ల మహిళలపై జరుగుతున్న దాడులను కేంద్రం అరికట్టాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు రెహానా బేగం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయం లో మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల వివక్ష లేకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ మహిళా విభాగం నాయకులకు దుశ్శాలువలతో సన్మానించారు.

ఆహార పదార్థాల ఎగుమతే లక్ష్యం

చిత్తూరు అగ్రికల్చర్: దేశంలో దిగుబడి అయ్యే ఆహార పదార్థాల ఎగుమతే ప్రధాన లక్ష్యమని పండ్ల పరిశ్రమల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ బాబీ తెలిపారు. న్యూఢిల్లీలో సోమవారం ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెస్ అసోసియేషన్, భారత ప్రభుత్వ మినిస్టరీ ఫుడ్ ప్రాసెసింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార పదార్థాల ఎగుమతి పై నిర్వహించిన సెమినార్‌లో ఆయనతో పాటు పండ్ల పరిశ్రమల సమాఖ్య సభ్యుడు తలపులపల్లె బాబు రెడ్డి పాల్గొన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు దోహదపడే రాయితీలు, ఇతర అనుమతులపై పరిశ్రమల యజమానులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

కమనీయం.. మొగిలీశ్వరుని కల్యాణం









నందిపై పార్వతీపరమేశ్వరులు, గజ వాహనంపై ఆదిదంపతులు, శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ కల్యాణోత్సవం, తిలకిస్తున్న భక్తులు

బంగారుపాళెం: స్వయంభు శ్రీ మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుడైన శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఉదయం స్వామి, అమ్మవారి మూలవిగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి ఆవరణలోని కల్యాణ మండపానికి తీసుకువచ్చి పీటలపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉత్సవాల్లో మంగళవారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నటు ఈఓ తెలిపారు.

అధికార నందిపై పార్వతీపరమేశ్వరులు

తవణంపల్లె: కాళభైరవేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అధికార నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం కాలభైరవేశ్వరునికి, శివలింగానికి, నందీశ్వరునికి అభిషేకం, అలంకరణ, పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. రాత్రి అధికార నంది వాహనంపై పార్వతీపరమేశ్వరులు కొలువు దీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. దీనికి మొదలియార్ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. దేవస్థానంలో మంగళవారం పుష్పపల్లకి సేవను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

రథంపై ఏకాంబరేశ్వరస్వామి

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఏకాంబరేశ్వర స్వామి ఆదివారం రాత్రి గజ వాహనంపై సోమవారం ఉదయం రథంలో విహరించారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ఐరాల: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నవెంకటంపల్లెలో వలంటీర్లతో కలిసి ఆయన సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన 'చెప్పాడంటే.. చేస్తాడంతే' కార్యక్రమం నిర్వహించారు. ఈ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబం ఏ మేరకు లబ్ధి పొందిందో గుర్తు చేసేందుకు సీఎం జగన్ లేఖ సందేశాన్ని ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఎగువకామినాయనపల్లెలో పార్టీ నేత సుధాకర్‌నాయుడు వలంటీర్‌తో కలిసి జగనన్న సందేశపు లేఖను లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన 99 శాతం హామీలను జగనన్న అమలు చేశారని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగనన్నను గెలిపించుకోవాలన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న దేవేంద్రరెడ్డి

చిత్తూరులో కొల్లం రైలుకు స్టాపింగ్

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతి నుంచి కొల్లం వరకు వెళ్లే రైలుకు చిత్తూరులో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పలువురు నాయకులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయడంతో రైల్వే శాఖ ఈ స్టాపింగ్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

నేడు ప్రారంభోత్సవాలు

తవణంపల్లె: మండలంలోని గురుకువారిపల్లెలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి తెలిపారు. ఇందుకు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ సునీల్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

విజయానందరెడ్డితో విభేదాలు లేవు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొంగారెడ్డిపల్లిలో ఇద్దరు యువకులు గొడవపడగా వారికి నచ్చచెప్పడానికి వెళితే వర్గ విభేదాలు అంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తనకు డిప్యూటీ మేయర్ పదవి రావడానికి విజయ్ అన్న కారణమన్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్ నాయకులు కుమారస్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రాజేష్

ఉచిత కంటి పరేషన్లకు 34 మంది

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 34 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 55 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 34 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైనవారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

యాదమరి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం లలిత మాట్లాడుతు మా పాఠశాలలో ఉపాధ్యాయులు అందరు సోదరభావంతో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పోలీస్‌స్టేషన్‌లో బదిలీలు

గుడిపాల: పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న మునివేలును తవణంపల్లెకు బదిలీ చేశారు. తవణంపల్లె ఏఎస్‌ఐ రాజేంద్రను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం యాదమరి పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న లక్ష్మీపతి గుడిపాల స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీరు ఆయా స్టేషన్లలో బుధవారం రిపోర్ట్ చేయనున్నారు.

ఎన్నికలకు ప్రశాంత వాతావరణం

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాధ్యతలు వహించాలని ఆర్డీఓ చిన్నయ్య అధికారులకు తెలిపారు. మండలంలోని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఎస్‌ఐ, సీఐలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సమయంలో అధికారులు విధులను బాధ్యతతో నిర్వర్తించాలని, కింది స్థాయి సిబ్బందికి వివరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీసులే కీలకమని, వారు పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, సంక్షేమ పథకాల వివరాలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

విద్యార్థినికి ప్రోత్సాహకాల అందజేత

యాదమరి: మండల కేంద్రంలో చదువుకున్న విద్యార్థికి ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని షీజకు సోమవారం పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి సొంతంగా రూ.18వేలు నగదుతో పాటు షీల్డ్, మెమెంటో, స్వీట్లు అందించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే వారికి ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

నిరుద్యోగ భృతి పేరుతో బాబు బూచి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి
- నల్లవెంకటయ్యగారిపల్లి, పెరుమాళ్లకండ్రిగలో పల్లెబాట

చిత్తూరు రూరల్: చంద్రబాబు తన పాలనలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి పేరుతో బూచి చూపించారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఎద్దేవా చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ, నల్లవెంకటయ్యగారిపల్లి గ్రామంలో సోమవారం పల్లెబాట నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పేదల గుమ్మం ముందుకే సంక్షేమ పథకాలు వచ్చి తలుపుతట్టాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిమాటను శాసనంలా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేసినట్లు చెప్పారు. సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. వలంటీర్లతో పాటు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పలు శాఖల్లోని ఖాళీలను వెనువెంటనే భర్తీ చేశారని చెప్పారు. కొన్నేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించి, మాట తప్పని సీఎంగా ముద్రవేసుకున్నారన్నారు. అయితే చంద్రబాబు తన పాలనను అబద్దపు హామీలతో నెట్టుకొచ్చారని గుర్తుచేశారు. 2014లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగ భృతి అంటూ నిరుద్యోగులను మోసం చేశారని చెప్పారు. ఇంటికొక్క ఉద్యోగమంటూ నట్టేట ముంచారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు ప్రజలను, ముఖ్యంగా యువతను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇలాంటి తప్పుడు హామీలకు మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అమరనాథ్ రెడ్డి, త్యాగరాజులు, సంపత్, సాము, నాగేంద్ర, భాస్కర్, ప్రసాద్‌నాయుడు, బాబు, ముత్తుకూరు భాస్కర్, కేశవులు, దిలీప్, ప్రతిమారెడ్డి, కుమార్, రాబర్ట్, రాజా, అరవింద్, నంద, గోవిందస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.





విజయానందరెడ్డితో మాట్లాడుతున్న వృద్ధురాలు, గ్రామ పర్యటనలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

బిడ్డ ఇస్తున్న పింఛన్‌తో తింటున్నాం

చిత్తూరు కార్పొరేషన్: ప్రతినెలా ఒకటో తేదీ ఇంటికి వచ్చి వలంటీర్ల ద్వారా బిడ్డ జగన్ ఇస్తున్న పింఛన్ డబ్బుతోనే బతుకుతున్నాం. ఆయన రుణం తీర్చుకోవాలి కదయ్యా..ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి రుణం తీర్చుకుంటానని ఓ వృద్ధురాలు చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డికి చెప్పింది. స్థానిక 15వ డివిజన్ వల్లియప్పనగర్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయనతో పలువురు వృద్ధులు మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని సంతోషంగా తెలియజేశారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రజల కష్టాలు తీరాలంటే జగనన్న మళ్లీ గెలిపించుకోవాలని ఆయన అన్నారు. విజయడెయిరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు హేమారెడ్డి, రమణ, శిరీష్‌రెడ్డి, గాయత్రీదేవి, భారతి, బాలాజీ, బషీర్, రాజబాబు, ఓటి చెరువు మధు, యువరాజు పాల్గొన్నారు.

తమ కుటుంబానికి ప్రాణహాని ఉంది

చిత్తూరు రూరల్: తమ కుటుంబానికి మేనమామ నుంచి ప్రాణహాని ఉందని తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన గుమ్మ రంజిత ఆరోపించింది. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను పుంగనూరు కొత్త ఇండ్లకు చెందిన పవన్ మూడేళ్లుగా ప్రేమించి, పెళ్లి కూడా చేసుకున్నట్లు తెలిపారు. అయితే కులాంతర వివాహం అని తెలిసి తన మేనమామ, తల్లిదండ్రులను వేధిస్తున్నాడని, అతడి నుంచి కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆరోపించింది. వారికి రక్షణ కల్పించేలా చూడాలని కోరింది.

ఐరాల ఎంపీడీఓగా వెంకటేశు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశుతో సిబ్బంది

ఐరాల: స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓగా డాక్టర్ సీ.వెంకటేశు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చౌడేపల్లె నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.